క్లుప్తంగా

కలెక్టర్ విస్తృత పర్యటన

కల్హేర్(నారాయణఖేడ్): కలెక్టర్ వల్లూరు క్రాంతి మండలంలో విస్తృతంగా పర్యటించారు. తనిఖీలు నిర్వహించి అధికార యంత్రాంగానికి దిశానిర్దేశం చేశారు. మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయం, ప్రాథమిక పాఠశాల, జెడ్పీహెచ్ఎస్, అంగన్‌వాడి కేంద్రం, ప్రభుత్వ ఆస్పత్రి సందర్శించారు. బాచేపల్లిలో గురుకుల పాఠశాల తనిఖీ చేశారు.

సమస్యలపై విన్నపాలు..

కలెక్టర్‌కు ప్రజాప్రతినిధులు, రైతులు వివిధ సమస్యలు విన్నవించారు. స్థానికంగా పోలీస్ స్టేషన్ భవనం నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని కోరారు. ప్రభుత్వ ఆస్పత్రికి రోడ్డు నిర్మించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోచయ్య కలెక్టర్‌ను కోరారు.

తెలంగాణను ప్రస్తావించక పోవడం బాధాకరం

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ పేరును కూడా ప్రస్తావించక పోవడం బాధాకరమని పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వెన్నవరం ఆదర్శ్ రెడ్డి, జిన్నారం మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బాల్‌రెడ్డి , పటాన్‌చెరు మాజీ జెడ్పీటీసీ సభ్యులు గడీల శ్రీకాంత్‌గౌడ్, సీనియర్ నాయకులు వెంకటేశం గౌడ్ అన్నారు. బుధవారం పట్టణంలోని భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మోదీ ప్రభుత్వం బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిందన్నారు. తెలంగాణ ప్రజలను కాంగ్రెస్, బీజేపీలు మోసం చేస్తుందన్నారు. సమావేశంలో మాజీ కార్పొరేటర్ అంజయ్య, నాయకులు కుమార్ గౌడ్, జగన్నాథ్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, నరసింహ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రెయిన్ కోట్స్ అందజేత

పటాన్‌చెరు: గ్రామ పంచాయతీ కార్మికుల రక్షణే ముఖ్యమని మండల పంచాయతీ అధికారి హరిశంకర్‌గౌడ్ అన్నారు. బుధవారం పటాన్‌చెరు మండలం రుద్రారంలో గ్రామ పంచాయతీ కార్మికులకు రెయిన్‌కోట్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో తిరిగే పారిశుద్ధ్య పనులు నిర్వహించే సిబ్బందికి వాటిని అందజేశామన్నారు. రుద్రారం గ్రామ కార్యదర్శి రాజు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

గణేశ్‌గడ్డ దేవస్థానం కిటకిట

పటాన్‌చెరు టౌన్: సంకటహర చతుర్థి సందర్భంగా పటాన్‌చెరు మండలం రుద్రారం గణేశ్‌గడ్డ దేవస్థానం బుధవారం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అర్చకులు సంతోశ్ జోషి, జగదీశ్వర్ స్వామి, చంద్రశేఖర్, అయ్యప్ప ప్రత్యేక పూజలు, హోమం చేశారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేసామని ఆలయ ఇన్‌చార్జి ఈఓ లావణ్య, జూనియర్ అసిస్టెంట్లు మల్లికార్జున్, ఈశ్వర్లు తెలిపారు. ఆలయంలో నిత్యఅన్నదాన కార్యక్రమం కొనసాగుతోందన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 10 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్ : డ్రంకెన్ డ్రైవ్ లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు 10 మందికి రూ. 2 వేల చొప్పున జరిమానా విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ పీఎస్ సీఐ లాలూ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. సోమ, మంగళవారాలు నిర్వహించిన డ్రైవ్‌లో 10 మంది పట్టుబడ్డారు. వారిని బుధవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా, జడ్జి 10 మందికి ఒక్కొక్కరికీ రూ. 2 వేలు చొప్పున జరిమానా విధించినట్లు ఆయన పేర్కొన్నారు.

ఉద్యోగులకు బదిలీలు సహజం

హత్నూర(సంగారెడ్డి): ఉద్యోగులకు బదిలీలు సహజమని, చేసిన సేవలు చిరస్థాయిలో నిలిచిపోతాయని ఎంపీడీఓ శంకర్ అన్నారు. బుధవారం మండలానికి సంబంధించిన ఎంపీఈఓ సువర్ణ, పంచాయతీ కార్యదర్శులు బదిలీ కావడంతో వారిని ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రజల సంక్షేమం కోసం పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు డబ్బుల పంపిణీ

కంది(సంగారెడ్డి): పారిశుద్ధ్య కార్మికులకు సబ్బులు, నూనెలు, బెల్లం తదితర వస్తువులను ఎంపీడీఓ శ్రీనివాస్ బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలుగు నెలలకు సంబంధించిన వస్తువులను కంది గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు అందజేస్తున్నమని అన్నారు. ప్రస్తుతం వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందని, అందరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎంపీఓ మహేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి విద్యాధర్‌గౌడ్, బిల్ కలెక్టర్ మల్లేశం పాల్గొన్నారు.



పారిశుద్ధ్య కార్మికులకు కిట్లను అందజేస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్

కళాశాలలో కమ్ముకున్న చీకటి!

విద్యుత్ మరమ్మతుల్లో చిన్నపొరబాటు కాలేజీ, హాస్టల్‌లను అంధకారంలోకి నెట్టాయి. ప్రహరీ గుంతలను తవ్వే క్రమంలో సర్వీస్ వైర్ తెగిపోయింది. దీంతో మంగళవారం రాత్రి పూర్తిగా చిమ్మచీకట్లు అలుముకున్నాయి. ఒక వారం నుంచి రోజూ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని విద్యార్థినులు లబోదిబోమంటున్నారు.

- రాత్రంతా నిలిచిపోయిన విద్యుత్ సరఫరా
- విద్యార్థినులు నిద్రకు దూరం
- సర్వీసు వైర్ తెగిపోవడమే కారణం..

జోగిపేట(అందోల్): అందోల్‌లోని మహిళా పాలిటెక్నిక్ కళాశాల, హాస్టల్‌లకు మంగళవారం రాత్రి 8.30 గంటల నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో విద్యార్థినులు రాత్రంతా నిద్రకు దూరమయ్యారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రహరీ నిర్మాణానికి అవసరమైన గుంతలను జేసీబీతో తవ్వే సమయంలో విద్యుత్ సర్వీస్ వైరు తెగిపోవడంతో వారం రోజులుగా పాలిటెక్నిక్ కళాశాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. సోమవారం మరమ్మతు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను సిబ్బంది ఏర్పాటు చేసినా ఇబ్బందులు మాత్రం తొలగలేదు. మంగళవారం రాత్రంతా కళాశాలకు కరెంట్ సరఫరా నిలిచిపోయింది. కొంతసేపు కొవ్వొత్తుల వెలుగుల్లో దోమల బెడద మధ్య జాగారం చేయాల్సి వచ్చిందని విద్యార్థినులు వాపోయారు. విద్యుత్ సరఫరా లేని కారణంగా వారు ఉదయం టిఫిన్, మధ్యాహ్న భోజనం ఆలస్యంగానే చేశారు. కళాశాల, హాస్టల్‌లో అకస్మాత్తుగా విద్యుత్ సరఫరా నిలిచిపోయిన కారణంగా 35 సీలింగ్ ఫ్యాన్లు, 60 ట్యూబ్‌లైట్లు, ఇన్వెటర్ కాలిపోయాయని చెబుతున్నారు.

300 మీటర్ల కేబుల్ ఏర్పాటు : ఏఈ శ్రీనివాస్

కళాశాలకు నిర్మిస్తున్న ప్రహరీ నిర్మాణం సమయంలో జేసీబీ సహాయంతో గుంతలు తవ్వడం వల్ల విద్యుత్ కేబుల్ వైరు తెగింది. రెండు రోజుల ముందే ట్రాన్స్‌ఫార్మర్ మార్చాం. 300 మీటర్లు ఏబీ కేబుల్‌ను ఏర్పాటు చేసి.. బుధవారం సాయంత్రం వరకు హాస్టల్ వరకు సరఫరాను పునరుద్ధరిస్తాం. కళాశాలకు అవసరమైన కరెంట్ సరఫరాను అందించే విషయమై కేబుల్ అందుబాటులో లేదు. గురువారం విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తాం.



అందోలు మహిళా పాలిటెక్నిక్ భవనం

వాస్తవమే : శ్రీనివాస్, ప్రిన్సిపాల్

కళాశాలలో మంగళవారం రాత్రి నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోవడం వాస్తవమే. టెక్నిక్ తెలిపారు. రాత్రి కొవ్వొత్తులు తెప్పించాం. హాస్టల్‌కు కూడా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. హాస్టల్ వరకు విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తామన్నారు.

తెలంగాణపై కేంద్రం వివక్ష

జోగిపేట(అందోల్): కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి ఒక్కపైసా కేటాయించకపోవడం అన్యాయమని మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. బుధవారం అందోల్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మాజీ మంత్రి కేటీఆర్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి మాట్లాడారు. సమైక్య రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతానికి అన్యాయం జరుగుతుందనే ఉద్యమాలు చేయాల్సి వచ్చిందని, ఉద్యమ ఫలితంగా ఏర్పడిన తెలంగాణ అభివృద్ధికి కేంద్రం నిధులు కేటాయించాల్సిన అవసరం ఉందన్నారు. బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు తెలంగాణను అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. ఏపీకి రూ.15 వేల కోట్లు కేటాయించి, రాష్ట్రానికి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. సమావేశంలో మాజీ డీసీసీబీ వైస్ చైర్మన్ జైపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అధ్యక్షుడు రామాగౌడ్, మాజీ ఏఎంసీ చైర్మన్ నాగభూషణం, పుల్కల్ మండల పార్టీ అధ్యక్షుడు ముద్దాయిపేట విజయ్‌కుమార్, నాయకులు సార శ్రీధర్, వెంకటేశం, మొగులయ్య, రాజు, జిన్నా విజయ్‌కుమార్, గోపాల్, వీరేశం, సంతోష్‌కుమార్, దుర్గేష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్

చెరువు తూము లీకేజీకి మరమ్మతులు

వట్‌పల్లి(అందోల్): అందోలు మండల పరిధిలోని కన్‌సాన్‌పల్లిలో చెరువు తూముకు బుంగ పడి నీరు వృథా కావడంపై ఈనెల 21న 'చెరువు తూముకు బుంగ'అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీంతో ఇరిగేషన్ అధికారులు స్పందించి ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు ఆధ్వర్యంలో బుధవారం చెరువు తూము వద్ద లీకేజికి మరమ్మతులు చేపట్టారు. కాగా, మర్మమతులు చేపట్టడంపై ఆయకట్టు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



తూముకు మరమ్మతు చేస్తున్న దృశ్యం

పోలీసులకు బాలుడి అప్పగింత



పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు బస్టాండ్‌లో బుధవారం సాయంత్రం ఓ బాలుడు తిరుగుతుండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారొచ్చి బాలుడిని స్టేషన్‌కు తీసుకొచ్చి వివరాలు అడగగా చెప్పలేకపోతున్నాడు. అయితే బాలుడికి మూగ, చెవుడు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. చిన్నారికి సంబంధించిన బంధువులు ఎవరైనా ఉంటే పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని కోరారు.

లైంగిక దాడి కేసులో 20 ఏళ్ల జైలు

కంది(సంగారెడ్డి): బాలికపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తికి 20 ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ పోక్సో కోర్టు తీర్పు వెలువరించింది. ఈ కేసుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని తుంకిళ్ల తండాకు చెందిన ప్రకాశ్ (22) అదే తండాకు చెందిన 16 ఏళ్ల ఓ బాలికపై 2019 లో లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు అప్పటి రూరల్ ఎస్సై శ్రీకాంత్ కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో ప్రవేశ పెట్టారు. నేరం రుజువు కావడంతో నిందితుడు ప్రకాశ్‌కు 20 ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ జిల్లా పోక్సో కోర్టు న్యాయమూర్తి కే జయంతి బుధవారం తీర్పునిచ్చారు.

సంక్షిప్త వార్తలు

◆ పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు



జహీరాబాద్ టౌన్: పీఆర్‌టీయూ యూనియన్ నాయకులు బుధవారం మండలంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. పీఆర్‌టీయూ మండలాధ్యక్షుడు తులసీరాం రాథోడ్ ఆధ్వర్యంలో నాయకులు హోతి(బి), గోవింద్‌పూర్, కోత్తూర్(బి), దిడ్గి, బుర్దిపాడ్, బూచినల్లి, చిన్న హైదరాబాద్, తుంకుంట, సత్వార్, చిరాగ్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి ఆయా పాఠశాల ఉపాధ్యాయులతో సభ్యత్వ నమోదు చేశారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీశైలం, నాయకులు వరాలు, అమర్నాథ్‌రెడ్డి, మోహన్, వెంకటేశం, రత్నయ్య శ్రీనివాస్, ప్రదీప్ కుమార్‌లు పాల్గొన్నారు.

◆ జూనియర్ అసిస్టెంట్‌కు సన్మానం

కల్హేర్(నారాయణఖేడ్): ఉద్యోగులకు బదిలీలు సహజమని, అయితే.. తాము చేసిన సేవలతో గౌరవం, పేరు ప్రతిష్టతలు వస్తాయని తహసీల్దార్ వెంకటేశ్వర్లు తెలిపారు. తహసీల్దార్ కార్యాలయలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన నరేష్ అమీన్‌పూర్ మండలానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా అయన్ను సన్మానించారు. ఆర్ఐ మల్లేశం, సర్వేయర్ సునీత, సిబ్బంది డేవిడ్, రాజు, లక్ష్మణ్, సాయికుమార్, రవి, ఆనంద్, కార్తిక్ పాల్గొన్నారు.

◆ సన్మానం

మునిపల్లి(అందోల్): బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను మాజీ జెడ్పీటీసీ మీనాక్షి సాయికుమార్ సన్మానించారు. బుధవారం మండలంలోని ఖమ్మంపల్లి పాఠశాల నుంచి ఇతర పాఠశాలకు బదిలీపై వెళ్తున్న ముగ్గురు ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రకాశం, వినయ్, వీణా, కార్యదర్శి కుమారి పాల్గొన్నారు.

◆ ప్రసాదం అందజేత

నారాయణఖేడ్: నారాయణఖేడ్ ఆర్టీసీ డిపో నుంచి గురుపౌర్ణమిని పురస్కరించుకుని అరుణాచలానికి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు సర్వీసు నడిపారు. ప్రయాణికులు అరుణాచలం, కాణిపాకం, వేలూరు గోల్డెన్ టెంపుల్, జోగులాంబ తల్లి ఆలయాలను దర్శించుకున్నారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డికి ఆయా ఆలయాల ప్రసాదాన్ని బుధవారం ఆర్టీసీ మార్కెటింగ్ సెల్ ఇన్‌చార్జి పాండు అందజేశారు.

◆ కార్మికుల హక్కుల పరిరక్షణే లక్ష్యం

హత్నూర (సంగారెడ్డి): కార్మికుల హక్కుల పరిరక్షణే లక్ష్యంగా బీఎంఎస్ పనిచేస్తుందని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ప్రభు అన్నారు. బుధవారం హత్నూర మండలం గుండ్లమాచినేరు గ్రామ శివారులోని ఆర్చ్ ఫార్మా లాబొరేటరీ వద్ద బీఎంఎస్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జనార్దన్ రెడ్డి, రాజయ్య, మురళి, పద్మనాభం , కార్మికులు పాల్గొన్నారు.

◆ రేవంత్ కేంద్రంతో లోపాయికారీ ఒప్పందం



సంగారెడ్డి: కుర్చీ బచావో బడ్జెట్ లాగానే అన్నట్లు కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉందని మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరిరెడ్డి ఆరోపించారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ నుంచి పెద్ద మొత్తంలో పన్నులు కేంద్రానికి పోతున్నా.. నిధుల కేటాయింపులో మాత్రం మొండి చెయ్యి చూపిందన్నారు. ఢిల్లీ చుట్టూ చక్కర్లు కొట్టిన సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. బడ్జెట్లో తెలంగాణకు జరిగిన అన్యాయంపై అసెంబ్లీలో తీర్మానం చేయాలి. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ఆర్ వెంకటేశ్వర్లు , మ్యాకం విఠల్ తదితరులు పాల్గొన్నారు.

◆ భవన నిర్మాణానికి శంకుస్థాపన

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని 16వ వార్డులో చేపట్టిన పద్మశాలి భవన నిర్మాణానికి బుధవారం మున్సిపల్ వైస్‌చైర్మన్ చింతా గోపాల్ శంకుస్థాపన చేశారు. కమిషనర్ ఉమ, ఇంజనీర్ రాజేష్, కౌన్సిలర్లు విద్యాసాగర్‌రెడ్డి, ఇంద్రమోహన్‌గౌడ్, ఆకుల శివకుమార్, శ్రీనివాస్, చౌదరి ప్రకాష్, బీఆర్ఎస్ నాయకుడు శివరాజ్‌పాటిల్, పద్మశాలి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): జల కాలుష్యానికి కారణమవుతున్న ఎవరెస్ట్ పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని ఆరూర్, కోనాపూర్, పెద్ద గోపులారం శివారులో ఎవరెస్ట్ పరిశ్రమ నుంచి వచ్చే కాలుష్య జలాలను బుధవారం తెలంగాణ రైతు సంఘం, కేవీపీఎస్ ప్రజా సంఘాల నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమ వ్యర్థ జలాలు మంజీరా నదిలో కలుస్తుండటంతో ప్రజలు, జంతువులు, జలచరాలకు ప్రమాదకరంగా మారిందన్నారు. నీటి వనరులను జల కాలుష్యం నుంచి కాపాడటానికి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఏసోబు, కుమార్, అశోక్, బాలరాజ్, మహేష్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ లక్ష్మారెడ్డి కథనం ప్రకారం మండలంలోని ఇస్నాపూర్ పరిధిలోని హనుమాన్ దేవస్థానం ఎదురుగా జాతీయ రహదారిపై ఈనెల 21వ తేదీన గుర్తు తెలియని వాహనం వ్యక్తిని ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన ఆయనను చికిత్స నిమిత్తం 108లో పటాన్‌చెరు ప్రభుత్వాసుపత్రి, అక్కడి నుంచి సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి సంబంధించిన బంధువులు ఉంటే పటాన్‌చెరు పోలీసులను సంప్రదించాలని సూచించారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మార్కెట్ కమిటీ డైరెక్టర్ పట్లోళ్ల శివకుమార్ పాటిల్ అన్నారు. రుణమాఫీ సందర్భంగా బుధవారం మండల పరిధిలోని కోనాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సీఎం రేవంత్‌రెడ్డి ఆగస్టు నెలలోపు రాష్ట్రంలో రూ.2 లక్షల పంట రుణాలు మాఫీ చేస్తామని నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. ఒక కోనాపూర్ గ్రామంలోనే దాదాపుగా వంద మంది రైతులకు రూ. 50లక్షలు వారి ఖాతాల్లో వేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ మేనేజర్ నవీన్ కుమార్, నాయకులు దశరథ్, అబిద్ హుస్సేన్, బక్కప్ప, జగదీశ్వర్, కృష్ణ, నర్సింలు, వీరన్న, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని సిద్దివినాయక ఆయిల్‌మిల్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. సుమారు 60 సంవత్సరాల వయసు కలిగిన వ్యక్తి శవం బుధవారం రోడ్డ పక్కన పడి ఉంది. మృతదేహాన్ని చూసిన వారు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. సంఘటనా స్థలాన్ని సందర్శించారు. యాచకుడి అయి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

కుక్కల నిర్మూలన కార్యక్రమం

జహీరాబాద్: మున్సిపల్ పరిధిలో కుక్కలను నిర్మూలన కార్యక్రమం చేపట్టారు. బుధవారం పట్టణంలోని ఖసాట్ మహెలా, చెన్నారెడ్డినగర్ కాలనీల్లో కుక్కలను పట్టే పనులను ప్రారంభించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగిన కార్యక్రమంలో 95 కుక్కలను పట్టారు. నిపుణులతో కుక్కలను పట్టారు. మున్సిపల్ అధికారులు సంధ్య, రవీందర్‌రెడ్డి పర్యవేక్షించారు.



కుక్కలను పడుతున్న నిపుణులు

ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

సంగారెడ్డి టౌన్: వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సంగారెడ్డి టౌన్ ఎస్ఐ నరసింహులు అన్నారు. బుధవారం సంగారెడ్డి ఆర్టీసీ డిపోలో ప్రమాద రహిత వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ వాహనాలు నడపాలన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ఉపేందర్, అసిస్టెంట్ మెకానిక్ ఇంజనీర్ మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

26 మంది పదోన్నతులు

మెదక్ రీజియన్ పరిధిలో 26 మందికి పదోన్నతులు కల్పించినట్లు రీజనల్ మేనేజర్ ప్రభులత తెలిపారు. కండక్టర్ నుంచి కంట్రోలర్ ఏడీసీ వరకు పదోన్నతి పొందిన వారికి అభినందనలు తెలిపారు.

ఏకాగ్రతతో డ్రైవింగ్ చేయాలి

నారాయణఖేడ్: డ్రైవర్లు ఏకాగ్రతతో డ్రైవింగ్ చేయాలని ఖేడ్ ఆర్టీసీ డీఎం మల్లేశయ్య సూచించారు. బుధవారం స్థానిక డిపోలో ప్రమాద రహిత వారోత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తున్నప్పుడు సెల్‌ఫోన్ మాట్లాడొద్దన్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్, కమిషనరు జగ్జీవన్ సురక్షిత డ్రైవింగ్‌పై సూచనాలు చేశబూరు. ఉత్తమ డ్రైవర్లను సన్మానించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ నర్సింహులు, మెకానికల్ ఇంజనీరు దశరథరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఖేడ్ ఆర్టీసీ డీఎం మల్లేశయ్య

బోనాల ఊరేగింపు



మహిళల బోనాల ఊరేగింపు

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని గొల్లకేరీ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో బుధవారం వైభవంగా బోనాల ఊరేగింపు నిర్వహించారు. మహిళలు దుర్గభవానీ మందిరం వరకు బోనాలను ఊరేగింగా తీసుకెళ్లి నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అపర్ణ, వైస్ చైర్మన్ చింతా గోపాల్, కౌన్సిలర్లు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు అమలు చేయండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో బుధవారం రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా రాష్ట్ర బీజేపీ ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యుడు రవికుమార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలం అయిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీ డిక్లరేషన్ ప్రకారం ఇచ్చిన హామీలను నెరవేరేస్తామని చెప్పారని అన్నారు. హామీలను పూర్తిస్థాయిలో అయలు చేయాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షుడు జగదీష్, భారతీనగర్ డివిజన్ ఓబీసీ మోర్చా అధ్యక్షులు యాదగిరి, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు బలరాం, రామచంద్రాపురం పట్టణ బీజేపీ అధ్యక్షుడు నర్సింగ్‌గౌడ్, నందారెడ్డి పాల్గొన్నారు.



రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలి



పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న మున్సిపల్ చైర్మన్

నారాయణఖేడ్: వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఖేడ్ పురపాలక సంఘ చైర్మన్ ఆనంద స్వరూపె షెట్కార్ సూచించారు. బుధవారం తెల్లవారుజామున కౌన్సిలర్ వివేకానంద్‌తో కలిసి రాంవిలాస్ గల్లీ, పటేల్ కాలనీ, ఇందిరానగరా కాలనీలలో పర్యటించారు. పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. రాజీవ్ కూడలి, శివాజీ కూడలి వద్ద గుంతలను పూడ్చాలని ఆదేశించారు.

అర్హులైన రైతులందరూ దరఖాస్తులివ్వండి

న్యాల్‌కల్(జహీరాబాద్): అర్హులైన రైతులందరూ బీమా కోసం దరఖాస్తులు ఇవ్వాలని ఏఓ లావణ్య కోరారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో బుధవారం రైతుబీమాకు సంబంధించి అర్హులైన రైతుల నుంచి ఏఈఓలు దరఖాస్తులను స్వీకరించారు. న్యాల్‌కల్, మామిడ్గి, ముంగి, గణేశ్‌పూర్, హుస్సెళ్లి తదితర గ్రామాల్లో ఏఈఓలు షరీఫ్, నిఖిత, మమత, మాధవి, ప్రవీణ్, హీనా తదితరులు రైతుల నుంచి దరఖాస్తులను అందుకున్నారు. రైతు వేదికలు, వ్యవసాయ కార్యాలయాలు, పంచాయతీ భవనాల్లో ఏఈఓలు రైతుల వద్ద నుంచి సుమారు 70వరకు దరఖాస్తులను స్వీకరించినట్లు లావణ్య తెలిపారు.



దరఖాస్తులను స్వీకరిస్తున్న ఏఈఓ

పౌరులంతా మొక్కలు నాటాలి

మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి



అమీన్‌పూర్‌లో మొక్కలు నాటుతున్న మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి

పటాన్‌చెరు: పట్టణంలోని పౌరులందరూ మొక్కలు నాటాలని అమీన్‌పూర్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి అన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని సాయి అంబిక ఫేస్-1 కాలనీలో మిషన్ భగీరథ పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం రాజేశ్వరి ఫేస్ 2 కాలనీలో వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పట్టణంలో పచ్చదనం పెంపొందించేందుకు అనేక చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. పారిశుద్ధ్య కార్యక్రమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి, కౌన్సిలర్ కల్పన ఉపేందర్‌రెడ్డి, కృష్ణ, కోఆప్షన్ సభ్యులు తల్లారి రాములు, సీనియర్ నాయకుడు కొల్లూరు యాదగిరి, కాలనీవాసులు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు పంపిణీ

జోగిపేట(అందోల్): అందోల్ – జోగిపేట మున్సిపాలిటీలో వనమహోత్సంలో భాగంగా జోగిపేటలోని 10, 11, 12, 13 వార్డుల్లో బుధవారం ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేశారు. ప్రతీవార్డులో ప్రభుత్వం ద్వారా పంపిణీ చేసిన మొక్కలను నాటాలని కమిషనర్ సూచించారు. నాటిన మొక్కలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనదేనని గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమములో చైర్మన్ మల్లయ్య, కమిషనర్ తిరుపతి, వార్డు కౌన్సిలర్లు రేఖ ప్రవీణ్, నాగరాజు, రంగా సురేష్, మున్సిపల్ సిబ్బంది, సానిటరీ ఇన్‌స్పెక్టర్ వినయ్, మెప్మా సీఓ. భిక్షపతిగౌడ్, మెప్మా ఆర్‌పీలు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

రేపు రక్తదాన శిబిరం

నారాయణఖేడ్: కార్గిల్ విజయ్ దివాస్ సందర్భంగా శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి ఖేడ్‌లోని కరసుత్తిరోడ్డులోని శ్రీమహాలక్ష్మీ ఆసుపత్రిలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఖేడ్ రక్తదాతల సమూహ వ్యవస్థాపకుడు ముజాహిద్ చిస్తీ బుధవారం తెలిపారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన వీరజవాన్ల త్యాగాలను సర్మించుకుంటూ బాధ్యతగల పౌరులుగా రక్తదానం చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఓంప్రకాష్, కొటారి నర్సింహులు, లక్ష్మణ్, మోహన్ పాల్గొన్నారు.